

దుమ్మురేపుతున్న కల్కి వసూళ్లు

రూ.800కోట్లకు చేరినట్లు చిత్రబృందం పోస్ట్

ప్రభాస్ కీలక పాత్రలో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2829 ఏడీ' హవా కొనసాగుతోంది. యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో అత్యంత ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న ఈ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తొలిరోజే రూ.191.5 కోట్లు వసూలు చేసిన 'కల్కి' ఇప్పుడు రూ.800కోట్లను తన ఖాతాలో వేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ మైథాలజీ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరడమే తరువాయి అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'కల్కి 2829 ఏడీ' విడుదలకు ముందే అమెరికాలో ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా అక్కడ ఈ చిత్రం నిడివి తగ్గించినట్లు తెలుస్తోంది. దాదాపు 3 గంటలపైన నిడివి ఉన్న 'కల్కి'.. ఇకపై 2.45 గంటలు ప్రదర్శితం కానుంది. చిత్ర నిర్మాణ సంస్థ పెట్టిన ఓ పోస్టర్‌లో ఈ విషయం స్పష్టమవుతోంది.

రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ



'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్'లతో ప్రపంచాన్ని ఆకర్షించిన రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ రూపొందించింది. దీని స్ట్రీమింగ్ తేదీని, ఇందులో ఏం చూపనున్నారో తెలుపుతూ తాజాగా ఆ సంస్థ పోస్ట్ పెట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. 'ఒక మనిషి.. అనేక బ్లాక్‌బస్టర్‌లు.. అంతులేని ఆశయం. ఈ లెజెండరీ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? ఎన్ని సంవత్సరాలు పట్టింది? ఇలాంటి అంశాలతో 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది. ఆగస్టు2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది' అని సంస్థ పేర్కొంది. దీన్ని అనుపమా చోప్రా సమర్పించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో పలువురు హాలీవుడ్ దర్శకులు, సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోలు కూడా ఈ దర్శక ధీరుడితో వారి అనుబంధాన్ని పంచుకోనున్నట్లు తెలుస్తోంది.

మరో మూడేళ్లకు.. కల్కి సెకండ్ పార్ట్

ప్రభాస్ కథానాయకుడిగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన 'కల్కి 2898ఏడి' సినిమా గత వారం విడుదలైంది. ఈ సినిమాకి మిశ్రమ స్పందన లభించింది అనే చెప్పాలి. ఇందులో బాలీవుడ్ లెజండరీ నటుడు అమితాబ్ బచ్చన్, ఇంకొక లెజండరీ నటుడు కమల్ హాసన్ కూడా వున్నారు. ఇప్పుడు విడుదలయింది మొదటి పార్టు అని, రెండో పార్టు ఇంకో మూడు సంవత్సరాల తరువాత విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

రాజ్ తరుణ్ కేసులో ట్విస్ట్

టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ తనని మోసం చేశాడంటూ అతని ప్రేయసి లావణ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వదిలేసి వెళ్లిపోయాడని లావణ్య నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తాము విడిపోవడానికి కారణం ఓ సినీ నటి అని, రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా దొరకకుండా చేస్తామని బెదిరించినట్లు సినీ నటితోపాటు ఆమె సోదరుడిపై ఫిర్యాదు చేసింది లావణ్య. అయితే ఈ కేసులో పోలీసులు లావణ్యకే రివర్సులో నోటీసులిచ్చారు. ఈ నోటీసులో ఫిర్యాదుకు సంబంధించి తగిన ఆధారాలు సమర్పించాలని 91 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులపై ఇంకా లావణ్య స్పందించలేదు. మరోవైపు లావణ్యను విచారణకు పిలిస్తే.. తన వైపు వాదనలను కూడా వినిపిస్తానని నటుడు రాజ్ తరుణ్ నార్సింగి పోలీసులతో చెప్పినట్లు సమాచారం. కాగా.. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఉత్తరాది భామ మాల్వి

తెలుగు యువ నటుడు రాజ్ తరుణ్ ఇప్పుడు వార్తల్లో వున్నాడు. అతని ప్రియురాలు అని చెప్పుకుంటున్న లావణ్య అనే అమ్మాయి నార్సింగి పోలీసు స్టేషన్ లో రాజ్ తరుణ్ పై ఫిర్యాదు చేసింది. తనని ప్రేమించి, పెళ్లి చేసుకుంటాను అని మోసం చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే రాజ్ తరుణ్ ఇప్పుడు చేస్తున్న సినిమా 'తిరగబడరా స్వామి' లో కథానాయికగా చేస్తున్న మాల్వి మల్హోత్రాతో కలిసి ఉంటున్నాడని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా తెలిసింది. అయితే లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా రాజ్ తరుణ్ నిజంగానే మాల్వి తో వుంటున్నాడా? ఇంతకీ ఈ మాల్వి ఎవరు అన్న ఆసక్తి వస్తోంది. మాల్వి మల్హోత్రా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో మండి అనే వూర్లో ఒక పంజాబీ కుటుంబంలో పుట్టింది. చదువంతా చండీగఢ్ లో సాగింది, తరువాత ఆమె ముంబాయి షిఫ్ట్ అయి, మాస్టర్స్ ఇన్ కంప్యూటర్స్ కోసం యూనివర్సిటీ అఫ్ ముంబైలో చదివింది. నటిగా ముందుగా కనిపించింది మాత్రం బుల్లితెరపైనే, 2017లో 'ఉడాన్' అనే సీరియల్ లో.. వెండితెరపై ఆమె అరంగేట్రం చేసింది 'హోటల్ మిలన్' అనే సినిమాలో. ఇది 2018లో విడుదలైంది. సుమారు నాలుగేళ్ల తరువాత మాల్వి 'తమస్' అనే ఒక షార్ట్ ఫిలింలో నటించింది. ఇది 2022లో వచ్చింది. ఆ తరువాత సంవత్సరం మాల్వి ఒక ఓటిటి సినిమాలో నటించింది, కానీ ఆమెకి తగినంత గుర్తింపు రాలేదనే చెప్పాలి. 2023లో 'అభ్యుహం' అనే సినిమాతో మలయాళంలో అరంగేట్రం చేసింది. అదే సంవత్సరం రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటించిన 'తిరగబడరా స్వామి' సినిమాతో తెలుగులో కూడా అరంగేట్రం చేస్తోంది. ఈ సినిమా ఇప్పుడు ప్రచారాలు చేస్తున్నారు, త్వరలోనే విడుదలవుతుంది. ఈ సినిమా చాలా కాలం నుండి చిత్రీకరణ, తరువాత పోస్ట్ ప్రొడక్షన్ ఇలా చేసుకుంటూ ఈమధ్యనే పూర్తి చేసుకుంది. రాజ్ తరుణ్ ప్రియురాలు లావణ్య ఆరోపిస్తున్నట్టుగా రాజ్ తరుణ్ ఈ సినిమాలో చేస్తున్న మాల్వి మల్హోత్రాతో వుంటున్నట్టుగా ఆరోపిస్తుంది. మరి అందులో నిజమెంతవుందో మాత్రం వీళ్ళకే తెలియాలి.